క్లుప్తంగా

ఉపాధి పనులు కల్పించాలి

ధరూరు: ప్రస్తుతం ఎలాంటి పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఉపాధి హామీ పని కల్పించి ఆదుకోవాలని కోతులగిద్ద గ్రామస్తులు కోరుతున్నారు. 20 రోజులుగా గ్రామంలో పనులు జరగడం లేదని, అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పనులు లేకపోవడంతో జీవనం కష్టంగా మారిందని, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్యదర్శికి సన్మానం



గట్టు: పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్‌ను శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో వర్కర్లు సన్మానించారు. పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జగన్నాథరావు బదిలీ కాగా, ఆయన స్థానంలో శివకుమార్ వచ్చారు. పంచాయతీ వర్కర్లు రఘు, వెంకటేష్, రంగమ్మ, మాణిక్యమ్మ, నాగేంద్రమ్మ, చెన్నప్ప, భీమన్న తదితరులు కార్యదర్శిని సన్మానించి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఉన్న ఓల్డ్ ఏబీ స్విచ్‌లు మార్చడం, చెట్ల తొలగింపు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3:30గంటల నుంచి 4:30గంటల వరకు గద్వాల పట్టణంలోని గంజిపేట, గాంధీచౌక్, కృష్ణారెడ్డి బంగ్లా, బీరెల్లి చౌరస్తా, 2వ రైల్వేగేటు, టీచర్స్ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, రైల్వేస్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్యవరణాన్ని పాడు చేస్తున్న అధికారులు



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి డంపింగ్ యార్డుకు తరలించాలనేది ప్రభుత్వ లక్ష్యం. మండలంలోని అధికారులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సింది పోయి కార్యాలయాల్లో ఉన్న చెత్తను ఊడ్చి కాల్చేస్తున్నారు. దీని ద్వారా పర్యవరణాన్ని పాడు చేస్తున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే ఇలా చేయడం సరి కాదని ప్రజలు పేర్కొంటున్నారు.

వందరోజుల్లో ఉపాధి పనులు పూర్తి చేయాలి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న కూలీలు వందరోజుల పనులను పూర్తి చేయాలని ఏపీఓ విజయ్‌శంకర్, ఐకేపీ ఏపీఎం భీమన్న సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఐకేపీ సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాలకు గ్రామంలోని స్త్రీ, పురుషులకు ఉపాధి హామీ పనులలో ఉత్సాహంగా పాల్గొనేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో అర్హతను సాధించేటట్లుగా గ్రామాల్లో చైతన్యం కల్గించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

పశుసంపద అభివృద్ధికి కృషి చేద్దాం



శాంతినగర్: గ్రామాల్లో పశుసంపదను అభివృద్ధి చేసేందుకు కృషిచేద్దామని మండల పశువైద్యాధికారి పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 59 మంది రైతులకు చెందిన 377 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది వరప్రసాద్, లతీష్, రవికిరణ్, వెంకటమ్మ, కృష్ణనాయుడు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి..

గద్వాల వ్యవసాయం: గాలికుంటు వ్యాధి రాకుండా పశువులకు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి శంకరయ్య పాడి రైతులకు సూచించారు. మండలంలోని జిల్లెడబండ, మదనపల్లి గ్రామాల్లో పశువైద్య సిబ్బంది 46 మంది రైతులకు చెందిన 153 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది క్రిష్ణయ్య, నర్సింహ పాల్గొన్నారు.

అయిజ: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. మండలంలోని కుటుకనూరు, చిన్న తాండ్రపాడులో మొత్తం 553 పశువులకు వెటర్నరీ సిబ్బంది టీకాలు వేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో విజ్ఞానం



ఆలయాల నమూనాను ఎంఈఓకు వివరిస్తున్న విద్యార్థులు

- మెదడుకు మేత–విద్యకు పదును
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

జోగుళాంబ శక్తిపీఠం: చిన్నారులతో రూపొందించిన పదర్శనలు మెదడుకు పదునుపెట్టేలా కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. శనివారం అలంపూర్ పట్టణంలోని గురుదేవ్ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని ప్రదర్శించే వైజ్ఞానికి ప్రదర్శనలు, వివరణాత్మక తీరు అందరిని ఆకట్టుకుంది. నర్సరీ విద్యార్థులు పలు శ్లోకాలను వారి చిట్టిపొట్టి మాటలతో అవలీలగా చెబుతూ ఆకట్టుకున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలకు సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్)ను ఉపయోగించి యాక్టివిటీ ద్వారా సులభశైలిలో వివరించిన తీరు ఆకట్టుకుంది. గణిత, సామాన్య శాస్త్రానికి



అధునాతన పద్ధతితో ఐడిఫెక్ట్ ను వివరిస్తున్న షణ్ముక్



ఆశక్తిగా విద్యార్థులతో షుగర్ టెస్ట్ చేయించుకుంటున్న ఎంఈఓ

సంబంధించిన అనేక ప్రయోగాలను, ఈనాటి సమాజం ఎదర్కొంటున్న గ్లోబల్ వార్మీ, అకాల వర్షాలు, నీటి శుద్ధత, కల్తీ పదార్థాలను గుర్తించి పరిష్కారాలను ప్రయోగాల ద్వారా తెలిపారు. అలంపూర్ చరిత్రతో పాటు వివిధ దేవాలయాల నమూనాను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు షుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.

అబ్బుర పరిచిన ప్రదర్శనలు..

10వ తరగతి విద్యార్థి షణ్ముక్ కంటి చూపులోని లోపాలు, కంటి అద్దాలు ఉపయోగించడం వల్ల కంటి లోపల జరిగే ప్రక్రియను అధునాతన పద్ధతిలో వివరించారు. కుంబాకార, పుటాకార కటకాలను ఉపయోగించి దూర దృష్టి, దగ్గర (హ్రస్వ) దృష్టి లోపాలను సవరించ బడే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ఇటీవల నిర్మించిన అయోధ్య ఆలయ నమూనా, అలంపూర్‌లోని పాపనాశిని, సంగమేశ్వర, నవబ్రహ్మ ఆలయాల నమూనాలను తయారు చేసి వాటి చరిత్ర విశిష్టతను వివరించారు.

ప్రతి ఒక్కరికీ వచ్చే ప్రధాన సమస్యపై 'దృష్టి' పెట్టా



వైజ్ఞానికి ప్రదర్శనకు సంసిద్ధమయ్యే ముందు ఏ వైజ్ఞానిక ప్రదర్శనను ఎంపిక చేయాలని బాగా ఆలోచించాను. ప్రస్తుతం ప్రతి ఒకరికీ వచ్చే ప్రధాన సమస్య కంటి సమస్య. కాబట్టి ఈ సమస్యను పరిష్కార మార్గాలపై దృష్టి సారించి కంటి లోపాలపై అన్వేషణ చేసి ఐడిఫెక్ట్ ప్రాజెక్టును ఎంపిక చేసుకుని ప్రదర్శించాను.

– షణ్ముక్, 9వ తరగతి విద్యార్థి

ప్రదర్శనలతో కొత్త ఆలోచనలు..



విద్యార్థులతో నిర్వహించబడిన వైజ్ఞానిక ప్రదర్శన ప్రతి ఒక్కరిలో కొత్త ఆలోచన రేకెత్తించేలా కనిపించాయి. మేము చూసినంతలో చాలా వరకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శన వెనకాల పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తయారు చేసి ఇస్తుంటారు. కానీ ఇక్కడ ప్రదర్శించినవన్నీ విద్యార్థులే స్వతహాగా తయారు చేసి చూపించడం సంతోషం అనిపించింది.

– మద్దిలేటి, విద్యార్థి తండ్రి

నైపుణ్యాలను వెలికి తీసే ప్రయత్నమే..



చదువుతో పాటు చిన్నారులలో దాగి ఉన్న వివిధ నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుంది. నిత్యం చదువుతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు నూతనోత్సాహాన్ని తీసుకొస్తాయి.

– శ్రీ విద్య, ప్రధానోపాధ్యాయురాలు

పోషకాలుండే ఆహారం తీసుకోవాలి

- సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ కమలాదేవి సూచించారు. శనివారం బిజ్వారం, మల్దకల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, యామిని, టీచర్లు పార్వతమ్మ, వరలక్ష్మి, లక్ష్మీరంగమ్మ, సురేఖ, మహేశ్వరమ్మ, పుష్పమ్మ పాల్గొన్నారు.

గట్టు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఆలూరు అంగన్‌వాడీ టీచర్ ఇందిర సూచించారు. పోషణమాసంలో భాగంగా ఆలూరు గ్రామంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ ఆకు కూరలు, కూరగాయలతో పాటుగా చిరు ధాన్యాలను ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు లలిత, గర్భిణులు, బాలింతలు, బాలికలు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం..

అలంపూర్ రూరల్: పట్టణంలోని వాల్మీకి భవనంలో ఐసీడీఎస్ పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూనరాణి, అంగన్‌వాడీ టీచర్ల జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అక్కమ్మ, ఏఎన్ఎం శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



అలంపూర్‌లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, వైద్య బృందం



ఎర్రవల్లిలో..

ఎర్రవల్లిచౌరస్తా: గర్భిణులు, బాలింతలు మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని డీడబ్ల్యూఓ సుధారాణి అన్నారు. శనివారం ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి-1, కొండపేట అంగన్‌వాడీ కేంద్రాలలో ఘనంగా పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, వంటల పోటీలు, గర్భిణులకు సీమంతాలు చేశారు. గద్వాలకు చెందిన రాజశేఖర్, గ్రామానికి చెందిన కుర్వ నర్సింహులు కొండపేట అంగన్‌వాడీకి టీవీ, కూలర్‌ను బహూకరించారు. అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరి కొండపేటలో చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్య, ఐసీపీఎస్ సిబ్బంది, ఆయా గ్రామాల అంగన్‌వాడీలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 11 మంది గైర్హాజరు

అయిజ: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం గణితశాస్త్రం పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిపార్ట్ మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఠాగూర్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బ్రైట్ స్టార్, కృష్ణవేణి హైస్కూల్, మండలంలోని ఉత్తనూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 975 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.



ధరూరు: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ధరూరులో 265కు గాను, 265 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉప్పేరులో 172కు గాను, 171 మంది, మార్లబీడు సెంటర్‌లో 178కి గాను, 177 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో తాగు నీటి వసతితో పాటు వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు.

మానవపాడు: పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 284మంది విద్యార్థులకు గాను, 283మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎస్ఐ చంద్రకాంత్ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్త్ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అలంపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే కర్నూల్ జిల్లా బస్తీపాడుకు చెందిన వెంకటేష్ అలంపూర్ చౌరస్తా వైపునకు గ్యాస్ గోదాం దగ్గర వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లడంతో గాయాలయ్యాయి. జాతీయ రహదారి వాహనంలో ద్విచక్ర వాహనదారుడిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

శివాలయంలో రాతి స్తంభాల ప్రతిష్ఠ



దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

గద్వాల: నల్లకుంట కాలనీలోని శివాలయంలో వైభవంగా పూజలు నిర్వహించారు. శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఆలయ రాతి స్తంభాలను శనివారం సాంప్రదాయబద్ధంగా పూజలు చేసి ప్రతిష్ఠించారు. సుమారు రూ.రెండు కోట్ల వ్యయంతో శివాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. రాతిస్తంభాల ఏర్పాటుకు ముందుకొచ్చిన దాతలను ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. పారుచర్ల సురేందర్‌రెడ్డి, ఆలూరు ప్రకాష్‌గౌడ్, పూజారి కృష్ణ, సోనీ వెంకటేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పులిపాటి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షులు వెంకట్రాములు, గుమ్మడం గోపాల్, రాంరెడ్డి, అర్జున్‌రావు, నల్లారెడ్డి, టీఎస్ఆర్ జగదీష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామి మూల విగ్రహం



రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేస్తున్న భక్తులు

రాజోళి: శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం రాజోళిలోని బ్రమరాంభ అడివేశ్వర స్వామి ఆలయంతో పాటు తుంగభద్ర నది మధ్యలో ఉన్న రామలింగేశ్వర ఆలయంలో శివుడికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నది మధ్యలో ఉన్న ఆలయంలో భోజనాలు చేసి సరదాగా గడిపారు.

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రపాణి జోషి భక్తులకు స్వామి వారి విశిష్టతను తెలిపారు. ఉదయం స్వామి వారిని అలంకరించారు.

సమస్యలపై వినతిపత్రం అందజేత



గ్రామ సమస్యలపై కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన గ్రామ యువకులు

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం గ్రామంలోని వివిధ సమస్యలపై శనివారం నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ సుబాన్‌కు ఎస్సీ కాలనీ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. డ్రెయినేజీ, నీటి కొరత, వీధిలైట్లు, అంగన్ వాడీ, మొదలగు సమస్యలపై యువకుడు రంగస్వామి ఆధ్వర్యంలోని వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోవిందు, ప్రదీప్, రాజు, రంగస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంవీఎఫ్ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌పురంలో బడి బయటి పిల్లలను గుర్తించి నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అనంతరం సుల్తాన్‌పురం నుంచి నందిన్నెకు ఎటువంటి ట్రాన్స్‌పోర్ట్ లేకపోవడంతో గమనించిన ధరూరు ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ విశాల్, ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్, హుస్సేన్, పైటాల నర్సింహులు ముందుకొచ్చి విద్యార్థులకు రూ.35 వేలతో 8 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్‌హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో- ఆర్డీనేటర్ సాయికుమార్, సీఆర్‌పీఎఫ్ కో–కన్వీనర్ యుగంధర్, బడేసాబ్, మల్లేష్, గోవిందు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంవీఎఫ్ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



ధరూరులో జిల్లా అధ్యక్షులను సన్మానిస్తున్న సుధాకర్‌రెడ్డి

ధరూరు: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన జిల్లా అధ్యక్షుడు బాబు నాయుడు, గౌరవ అధ్యక్షులు మాకం బీచుపల్లి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్ పాఠశాలలో నూతన కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై, ఇబ్బందులపై చర్చించారు. సంఘం ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారినికి కృషి చేస్తుందని మాకం బీచుపల్లి తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడికి ఘన నివాళి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లిలో ప్రజా నాయకుడిగా పేరుగాంచిన మాజీ జెడ్పీటీసీ జగన్నాథరెడ్డి మొదటి వర్ధంతిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీని ఆయన కుమారులు రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



షేకుపల్లిలో ప్రజా నాయకుడికి నివాళులర్పిస్తున్న నాయకులు

బావిలోపడి విద్యార్థి మృతి



భూపతిగౌడ్ (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు ఇంటర్ విద్యార్థి బావిలో పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడుకు చెందిన దేవేందర్‌గౌడ్, పద్మావతిల కుమారుడు భూపతిగౌడ్(17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్నాడు. శనివారం భూపతిగౌడ్ తాతయ్య రామన్న కేశవరం సమీపంలో ఈదులు గీస్తుండగా, అతని వద్దకి వెళ్లాడు. తాతయ్య మనవడిని సమీపంలోని గుడిలో కొబ్బరికాయ కొట్టి రమ్మన్నాడు. స్నానం చేసి వస్తానని భూపతిగౌడ్ వెళ్లాడు. తిరిగి ఎంతసేపటికి రాకపోవడంతో అనుమానంతో తాత ఇంటికి ఫోన్ చేశాడు. ఇంటికి రాలేదని చెప్పడంతో అనుమానంతో చుట్టుపక్కల వెతికారు. చివరకు బావిలో బాలుడి మృతదేహం కనిపించింది.

కాంగ్రెస్‌లో చేరిక

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండలంలోని షాబాద్‌కు చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ పరమేష్‌గౌడ్‌లు హైదరాబాద్‌లోని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, నర్సింహనాయుడు ఉన్నారు.

చైర్మన్‌ను కలిసిన నాయకులు

గద్వాల రూరల్: మున్సిపల్ చైర్మ న్ బీఎస్ కేశవ్‌ను ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు ఇసాక్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు చైర్మన్ నివాసంలో కలిసి సన్మానం చేశారు. పట్టణంలో మైనార్టీల సమస్యల చర్చించారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, ఖయ్యూం, ఖాజా, పర్వేజ్, ఇటియాస్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం

గద్వాల అర్బన్: దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం ప్రజలు భగత్‌సింగ్ స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య సంగ్రామానికి సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని హమాలీ అడ్డ వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ, బాలు, రఘు, జయన్న, ఎల్లప్ప ఉన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

రాజ్యాంగాన్ని, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించడ మే భగత్‌సింగ్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నా రు. జిల్లా కేంద్రంలోని పాతకూరగాయల మార్కెట్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మహేష్, మస్తాన్, శంకర్, వెంకట్రాములు, చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిఉప్పేరు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ ప్రవీణ్, నరేష్ ఉన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నాయకుల నివాళి

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అ న్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మహేష్, హనుమేష్, నరేష్ ఉన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పాతకూరగాయల మార్కెట్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ మాట్లాడారు.



అలంపూర్‌లో భగత్ సింగ్ వర్ధంతి

శాంతినగర్: ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు, యువత చైతన్యం కావాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామిక వాతావరణం కొరవడిందన్నారు. భారత రాజ్యాంగమే ప్రమాదంలో పడిందన్నారు. కార్యక్రమంలో రాజుగౌడ్, నరేష్, మురళీకృష్ణ, శివకుమార్‌లు పాల్గొన్నారు.

అలంపూర్: భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ అన్నారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని కేవీపీఎస్, డీవైఎఫ్‌వై, ఐకేపీ, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1928లో బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టులను, కార్మిక ఉద్యమాలను అణచి వే యడానికి ప్రజా భద్రత బిల్లు పారిశ్రామిక బిల్లు ప్రవేశపెట్టి విప్లవ పోరాటాలను అణచివేసే ప్రయత్నం చేసిందన్నారు. 1931 మా ర్చి 23న భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను ఉరి తీశారన్నారు. కార్యక్రమంలో ఆ యా సంఘాల నాయకులు బంగారు రఫీ, నాగరాజు, అజయ్, శ్రీనివాసులు, మహేష్, పరశురాం, నందు తదితరులు ఉన్నారు.